ప్రజాశక్తి
సోమవారం 3 ఏప్రిల్ 2023 5
పార్వతీపురం మన్యం



14 నుంచి సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారం

ప్రజాశక్తి - కలెక్టరేట్

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రానికి ద్రోహం చేసే విధానాలపై సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారం ఈనెల 14నుంచి 30 వరకు గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు జరపాలని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆదివారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ నిరంకుశ చర్యలను ఖండించాలని కోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ, జిల్లా నాయకులు బి.టి.నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి నష్టం చేసే బిజెపి చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకట రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- 64 కేంద్రాలు... 11,336 విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

ప్రజాశక్తి-పార్వతీ పురం రూరల్

జిల్లాలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లన్నీ పూర్తి పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షల్లో 11,336 విద్యార్థులు రాయనున్నారు. పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను, 64 మంది శాఖాపరమైన అధికారులను, 22మంది పేపర్ కస్టోడియన్స్, 5 సిట్టింగ్ స్క్వాడ్, 9 ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమించి పరీక్షలలో ఎటువంటి పొరపాటలు. జరగకుండా పర్యవేక్షిస్తున్నారు. 536 మంది ఇన్విజలేటర్లతో నిరంతర నిఘా కొనసాగుతుంది. విద్యార్థులకు, సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగ కుండా తాగునీరు, రాతబల్లలు ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎపిఎస్ఆర్‌టి ద్వారా ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు.

పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురం మండలంలో 9 పరీక్షా కేంద్రాలున్నాయి. గిరిజన సంక్షేమ పాఠశాల (డోకిశీల), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పెదబొండపల్లి), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఎంఆర్ నగర్), పార్వతీపురంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్‌సిఎం సెయింట్ పీటర్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నారాయణ స్కూల్, డివిఎంఎం మున్సిపల్ హైస్కూల్, సురేష్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ 9 కేంద్రాల్లో 1595 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు గాను 80 ఇన్విజిలేటర్లను నియమించారు.

కురుపాం: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 15 పాఠశాలలకు చెందిన 670 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రానున్నాయి. ఈ పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యమూ తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ధర్మలక్ష్మీపురంలో 286, కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 154, కురుపాం ఆదర్శ పాఠశాలలో 230మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు



పార్వతీపురం : బల్లలపై హాల్‌టిక్కెట్ల నెంబర్లు వేస్తున్న సిబ్బంది

ఏర్పాటు చేసి 143 సెక్షన్ అమలు చేస్తున్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లేయింగ్ స్కాడ్లు, 35 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో తప్పనిసరిగా తాగునీరు, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్, పరీక్షలు రాయడానికి బల్లలు సిద్ధం చేశారు. విద్యార్థులకు సరిపడా బల్లలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రాథమిక చికిత్స కోసం ఎఎన్ఎంలు, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. సెల్‌ఫోన్లతో ఛీఫ్ సూపరింటెండెంట్ సహా ఎవరినీ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు.

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, ములక్కాయ వలస మోడల్ పాఠశాల టెన్త్ పరీక్షా కేంద్రాల్లో 491 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధపడుతున్నారు. శంబర, మక్కువ జిల్లా పరిషత్ పాఠశాలలో చదివే విద్యార్థులకు మక్కువ జెడ్‌పి హైస్కూల్‌లోనూ, ములక్కాయ వలస, వెంకట బైరిపురం, ఎ.వెంకంపేట పాఠశాలలో చదివే విద్యార్థులకు మోడల్ పాఠశాలను పరీక్షా కేంద్రంగా కేటాయించారు. ఎర్రసమంత వలస ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పార్వతీపురం మండలం డోకిశీల పాఠశాలను పరీక్షా కేంద్రం కేటాయించారు. రెండు కేంద్రాలకు డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు, సిఎస్‌గా శంకరరావులను నియమించారు.

మూడు పరీక్ష కేంద్రాలు.. 475 మంది విద్యార్థులు

కొమరాడ : పదో తరగతి పరీక్షలకు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 475 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. గతంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. గత ఏడాది నుంచి కోవిడ్ దృశ్యా మూడో పరీక్ష కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ హై స్కూల్, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసి ఏర్పాట్లు చేస్తున్నారు. కొమరాడ, కోటిపాం విక్రాంపురం, గుణానపురం జిల్లా పరిషత్ హై స్కూల్, కస్తూరిబా గాంధీ విద్యాలయం, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర, బాలికల పాఠశాల, పులిపిరి, పెదఖేర్జల పాఠశాల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

వీరఘట్టం : మండలంలోని పరీక్షా కేంద్రాలైన నీలానగరం, బిటివాడ, గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, వీరఘట్టంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 735 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

పాలకొండ/పాలకొండ రూరల్ : డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో పదో తరగతి పరీక్షలకు 30 కేంద్రాలను ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో 5,614 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 30 మంది చీఫ్ సూపరింటిండెంట్లు, 30 డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు 234 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాలుగా చినమేరంగితో పాటు కురుపాం మండలంలో టీపాయ్ పాఠశాలలను గుర్తించారు. అక్కడ సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

జియమ్మ వలస : మండలంలోని చినమేరంగి, జియమ్మ వలస జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. చినమేరంగి కేంద్రంలో 244 మంది, జియమ్మవలస పరీక్షా కేంద్రంలో 151మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. చినమేరంగిలో కేంద్రంలో చినమేరంగి ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు పెదమేరంగి, పిప్పలభద్ర, కుదమ, రావాడ రామభద్రపురం, పెదమేరంగి విద్యార్థులు, జియమ్మవలస పరీక్షా కేంద్రంలో జియమ్మవలస పాఠశాలతో పాటు బిజెపురం, పెదబుడ్డిడి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

తప్పని కరెంట్ కష్టాలు

కురుపాం : ఓ పక్క ఉక్క పోత మరోపక్క కరెంటు కోతతో టెన్త్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజుల నుంచి విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక అయోమయంతో విద్యార్థులు చదవలేకపోతున్నారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో మరికొంచెం ఎక్కువగా చదివి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ప్రతి విద్యార్థికి ఆశలు ఉంటాయి. అయితే విద్యుత్ తరచూ అంతరాయం కలిగించడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



శ్లాబ్ పెచ్చులూడిపోయిన తరగతి గది

స్లాబ్ పెచ్చులూడిన భవనంలో....

సీతంపేట : మండల కేంద్రంలో గల ఎపి గురుకుల బాలుర పాఠశాలల పరీక్షా కేంద్రం విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. ఈ కేంద్రంలోని 8గదుల్లో 188మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అయితే మూడు గదుల్లోని శ్లాబులు పెచ్చులూడిపోయాయి. ఎప్పుడు ఎవరిపైనా పెచ్చులుపడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా మండలంలోని ఏడు కేంద్రాల్లోని 896మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చాలంటూ

అసెంబ్లీలో చేసిన తీర్మానం రద్దు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకుల తీర్మానం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బోయ, వాల్మీకులను, బెంతు ఒరియాలను గిరిజన తెగల జాబితాలోకి చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానం తక్షణమే ఉపసంహరించుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక గిరిజన సామాజిక భవనంలో గిరిజన సంక్షేమ సంఘం కార్యదర్శి పి.రంజిత్ కుమార్ అధ్యక్షతన' ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కె.మన్మధరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొత్స నర్సింగరావు, రైతు కూలీ సంఘం నాయకులు ఎస్.విశ్వేశ్వర రావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం, పిడిఎస్ఓ నాయకులు సోమేశ్, గిరిజన ఐక్య వేదిక నాయకులు బిడ్డిక తమ్మయ్య, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు దుర్గా, ఇతర నాయకులు జన్ని ముత్యాలు, గణేష్, తిరుపతిరావు, భూషణ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బోయ/వాల్మీకి, బెంతు ఒరియాలను గిరిజన తెగల జాబితాలో చేర్చాలన్న తీర్మానం చాలా దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంప్రదాయ గిరిజన ప్రజలకు ఇది తీవ్రమైన అన్యాయం చేస్తుందని అభిప్రాయ పడ్డాడు. గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 8న పార్వతీపురంలో జిల్లా సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సదస్సుకు ఆదివాసీలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

8న ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్ వద్ద నిరసనలు

బోయ వాల్మీకులకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 8న ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీసు వద్ద నిరసనలు తెలపనున్నట్టు ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశం మండంగి రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో సదస్సు నిర్వహించి చలో ఐటిడిఎ కార్యక్రమం ఈనెలాఖరులోపు నిర్వహిస్తామని తెలిపారు. వీటితో పాటు గ్రామాల్లో సంతకాలు సేకరణ, రాజకీయ నాయకులకు, గవర్నర్‌కు, రాష్ట్రపతికి వినతి పత్రాలు ఇస్తూ భవిష్యత్తులో ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బోయ వాల్మీకులకు అనుకూలంగా అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిడ్డిక అప్పారావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పువ్వల తిరుపతిరావు, జిల్లా సహాయ కార్యదర్శు కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య సేవలకు తప్పని తిప్పలు

సర్వజనావళికి వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అడుగడుగునా అవస్థలు ఎదురవుతున్నాయి. ఓవైపు వైద్య పోస్టుల ఖాళీ, మరోవైపు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సీటీ, ఎంఆర్ఐ స్కానర్లు, లేబోరేటరీలోని పనిముట్లు పని చేయడం లేదు. కొన్ని రకాల వైద్య పరీక్షలు కూడా అందుబాటులో లేవు. దీంతో జిల్లా కేంద్రాస్పత్రి నుంచి మెడికల్ కాలేజీ (సర్వజన ఆస్పత్రి)గా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

- మొరాయించిన సిటి, ఎంఆర్ఐ స్కానర్లు
- అందుబాటులోకి రాని సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు
- భర్తీ కాని మత్తు వైద్యుల పోస్టులు
- సర్వజన ఆసుపత్రిలో దుస్థితి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైన నేపథ్యంలో వైద్య విధాన పరిషత్తు ఆధ్వర్యంలో నడిచే విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిని, దానికి అనుసంధానంగా ఉన్న ఘోషా ఆస్పత్రిని కళాశాల సేవలకు కేటాయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా పేరు మార్చారు. పేరు మార్పుచేసినా, మెడికల్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినా వైద్యసేవలు మాత్రం పెద్దగా విస్తరించలేదు. వైద్యుల సంఖ్య, లేబోరేటరీ సేవలు మెడికల్ కాలేజీకి తగ్గట్టు విస్తరించకపోవడమే ఇందుకు కారణం. నిత్యం అత్యవసర శస్త్రచికిత్సలు నిర్వహించే ఈ ఆస్పత్రిలో రెండు మత్తు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరు లేకుండా శస్త్రచికిత్సలు చేయడమే సాధ్యం కాదు. ఇటువంటి పోస్టు ఖాళీగా ఉండడంతో మిగిలిన వారిపై పనిభారం, మానసిక ఒత్తిడి ఉంటుందనడంలో సందేహం లేదు. శస్త్రచికిత్సలు సకాలంలో చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. సిటి, ఎంఆర్ఐ స్కానింగ్ తదితరాలు ప్రభుత్వ పరంగా లేవు. వీటిని ఎన్ఆర్ఐ కార్పొరేట్ ఆస్పత్రి భాగస్వామ్యంతో సేవలందిస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ మిషన్లు మొరాయించడంతో ఈ స్కానింగులు అవసరమైన రోగులు ప్రయివేటుగా చేయించుకునే స్థోమత లేక, స్థానికంగా ఈ రకమైన సేవలు అందుబాటులో లేక సతమతమౌతున్నారు. ఈ విషయం నిన్నగాక మొన్న జరిగిన సమీక్షా సమావేశంలోనే తేటతెల్లమైంది.


వీటితోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యం, కీమో, రేడియేషన్ సేవలు స్థానికంగా అందుబాటులో లేపోవడంతో కొన్ని కేసులను విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయక తప్పని పరిస్థితి. మరోవైపు జిల్లా కేంద్రాస్పత్రిని మెడికల్ కాలేజీగా మార్పుచేశాక వైద్య సేవల విషయంలో రోగుల ఆశలు, ఆకాంక్షలు పెరిగాయి. అందుకు తగ్గట్టే రోగుల ఒపి, ఐపి కూడా పెరిగాయి. కానీ, సొంతంగా స్కానింగ్ మిషన్లే లేకపోవడం, థైరాయిడ్ వంటి చిన్న చిన్న టెస్టులు కూడా స్థానికంగా చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చివరికి అత్యవసర విభాగాల్లో వైద్యులు, సిబ్బంది, విజిటర్స్ ధరించాల్సిన నీలిరంగు, ఆకుపచ్చ గౌన్లు కూడా అందుబాటులో లేవంటూ సాక్షాత్తూ వైద్యాధికారులే అంగీకరించడం విస్మయానికి గురిచేస్తోంది.


టీకాలతోనే వ్యాధి నిరోధక శక్తి

- హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు
- ప్రజాశక్తితో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జగన్మోహనరావు ముఖాముఖి

పిల్లల్లో వ్యాధి నిరోధశక్తి పెంపునకు టీకాలు ఎంతో దోహదపడతాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు తెలిపారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు అప్రత్తమంతా ఉంటూ ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని సూచించారు. టీకా వేసే ముందు టీకా ఆవశ్యకతను పిల్లల తల్లిదండ్రులకు వైద్య సిబ్బంది వివరిస్తున్నారని తెలిపారు. అలాగే హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీటితో పాటు మరిన్ని వివరాలను 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

-ప్రజాశక్తి, కలెక్టరేట్





టీకా కార్యక్రమంపై ప్రజలకు ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు?

పిల్లల్లో వ్యాధినిరోధక శక్తిని పెంపొందించడానికి టీకాలు వేస్తున్నాం. టీకా కార్యక్రమాన్ని ప్రతి బుధ, శనివారాల్లో క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం వేస్తున్నాం. పిల్లలకు వేస్తున్న ప్రతి టేకా వివరాలను, గడువు తేదీలను టీకా కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో ఎఎన్ఎంలు ఆన్లైన్ నమోదు చేస్తున్నారు. టీకాలకు సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుగుతుంది.

పిల్లలకు ఇచ్చే టీకాల ప్రయోజనాలు ఏమిటి?

బిడ్డ పుట్టిన వెంటనే బిసిజి ఒపివి హెపటైటీస్-బి ప్రసవం జరిగిన 24 గంటల్లోపు ఆసుపత్రిలో వేయించుకోవాలి. గర్భిణీలకు నమోదు సమయంలో టిడి - 1, టిడి-2 వేయించుకోవాలి. ఒపివి- పోలియో నివారణకు, బిసిజి క్షయ నివారణకు, హెపటైటిస్ బి- హెపటైటిస్, కాలేయ సంబంధిత వ్యాధుల నివారణకు, రోటా డయేరియా నివారణకు, ఎం ఆర్ -తట్టు రూబెళ్ళ నివారణకు, పిసిమి న్యుమోనియా నివారణకు, డిపిటి- డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు, టిడి-ధనుర్వాతం నివారణకు ఉపయోగపడతాయి.

ఐదేళ్ల పిల్లల ఆరోగ్య పర్యవేక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో అంగన్వాడి కేంద్రాలను సందర్శించి పిల్లల వయసుకు తగ్గ బరువు సరి చూడడం జరుగుతుంది, ఎవరైనా పిల్లలు బరువులు, పెరుగుదల లేనట్లయితే పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారి పట్ల ప్రత్యేక పర్యవేక్షణ చేసి ఎన్ఆర్‌సిలకు తరలిస్తాం. జిల్లాలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రి, సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో ఎన్ఆర్‌సి కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో పది నుండి 15 రోజుల వరకు పిల్లలను వైద్య సిబ్బంది ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి పౌష్టికాహారం, చికిత్స అందిస్తారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులు పరిశీలించి ఎప్పటికప్పుడు, సూచనలు ఇవ్వడం జరుగుతుంది.

శాన్స్ ప్రోగ్రాం ప్రత్యేకత ఏమిటి?

పిల్లల్లో వచ్చే న్యూమోనియా, శ్వాస సంబంధిత వ్యాధులపై ప్రత్యేకంగా సర్వే చేయడం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ఈ వ్యాధుల నివారణ దృష్ట్యా శాన్స్ (SAANS) ప్రోగ్రాం ప్రవేశపెట్టింది.

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గర్భిణుల నమోదు సమయంలోనూ, పర్యవేక్షణ చేస్తున్న సమయంలో హైరిస్క్‌ను గుర్తించాలి. ముఖ్యంగా రక్తహీనత, కాన్పులు సంఖ్య ఎక్కువగా ఉండడం, గతంలో గర్భస్రావం జరగడం, పిండం అసాధారణ స్థితి, గర్భిణీ ఎత్తు 145 సెంటీ మీటర్ల కంటే తక్కువ, కాన్పుకు ముందు రక్తస్రావం, ఉమ్మ నీరు ఎక్కువగా ఉండడం మొదలగునవి గుర్తించినట్లయితే హై రిస్క్ గర్భిణీలు గా నమోదు చేసుకొని ప్రత్యేక ఆరోగ్య పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడం, రక్త హీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఆరోగ్య కేంద్రాల్లో ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇవ్వడం జరుగుతుంది. ప్రతినెలా 9,10 తేదీల్లో గర్భిణుల కోసం ప్రత్యేకంగా పిఎంఎస్ఎ కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతి హైరిస్క్ గర్భిణీ గృహ సందర్శనలు తరచుగా చేస్తూ ఆరోగ్య నివేదికలను ఇవ్వడం జరుగుతుంది. ప్రసవానికి వారం, ఐదు రోజులు ముందుగానే నిర్దేశించిన కేంద్రాలలో వైటిసి, బర్త్ వెయిటింగ్ హెూం, రిఫరల్ ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నాం. అవసరమైన వారికి రవాణా సదుపాయం కల్పిస్తున్నాం. ఆరోగ్యశ్రీ, పిఎంఎంవివై, జెఎస్‌వై, జెఎస్ఎస్‌కె తదితర పథకాలు అందజేస్తున్నాం.

గర్భస్థ, పిండలింగ నిర్ధారణ పై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయడం నేరం. కొన్ని ప్రత్యేక వైద్య, ఆరోగ్య సంబంధిత పరిస్థితుల్లో తప్ప, ఉద్దేశపూర్వకంగా నిర్ధారణ చేసిన వారికి, సహకరించిన వారికి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధించడం జరుగుతుంది. జిల్లాలో పలు స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అందజేస్తున్నాం. అలాగే లింగవివక్షపై క్షేత్ర స్థాయిలో సభలు, సమావేశాల్లోనూ, స్కూళ్లు, కాలేజీల్లో పలు అవగాహన కార్యక్రమాలు చేపడున్నాం.

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న సేవలు ఏమిటి?

జిల్లాలో పలు ఆరోగ్య కార్యక్రమాలపై ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అందజేస్తున్న వైద్య సేవలు, కదల్లేని స్థితిలో ఉన్న రోగుల గృహ సందర్శనలు , పాఠశాలలు , కళాశాలల్లో ఆరోగ్య పర్యవేక్షణ, అవగాహన కల్పించడం, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం మొదలగు కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నాం. అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఇతర ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ ఆరోగ్య నివేదికలను అందజేస్తున్నాం.

నీతి ఆయోగ్ సిఇఒతో కలెక్టర్ సమావేశం

కలెక్టరేట్ : నీతి అయోగ్ సిఇఒ బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం అశావాహ (ఏస్పిరేషనల్) జిల్లాల కలెక్టర్లతో విశాఖపట్నంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 397 గ్రామాలకు రోడ్లు అవసరం ఉందని, 12 గ్రామాలకు విద్యుత్ కల్పించాల్సి ఉందని చెప్పారు. జిల్లాలో 3.01 లక్షల పంట విస్తీర్ణం ఉందని అందులో 1.88 లక్షలకు జలవనరుల సదుపాయం ఉందని వివరించారు. పాచిపెంట మండలంలో ఇండస్ట్రియల్ పార్కుకు స్థలాన్ని గుర్తించామని చెప్పారు. విశాఖ - రాయపుర్, అరకు, పాడేరు, చింతపల్లి మీదుగా వెళుతున్న జాతీయ రహదారులను ఎన్‌హెచ్-26కు అనుసంధానం చేసి తూర్పు కనుమల కారిడార్ (ఈస్టర్న్ ఘాట్ కారిడార్) గా నామకరణం చేయాలని, తద్వారా పర్యాటక రంగంభివృద్ధి జరిగి భారీ ఎకనమికల్ కారిడార్ గా అభివృద్ధి చెందగలదని, దీనిని పరిశీలించాలని కోరారు. సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వైఖరి దొంగే దొంగ అన్నట్లుంది

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేరుస్తూ తీర్మానించింది వారే
డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

గిరిజనులకు నాడు వెన్నుపోటు పొడిచిన టిడిపి ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం దొంగే దొంగ అన్నట్లు ఉందని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2017 డిసెంబర్ 2న నాటి టిడిపి ప్రభుత్వం బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని చెప్పారు. అప్పుడు గిరిజన ఎమ్మెల్సీగా సంధ్యారాణి ఏం మాట్లాడారని ప్రశ్నించారు. టిడిపి గిరిజన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కనీసం నోరు మెదపలేదన్నారు. ఆ తర్వాత వైసిపి ఎస్టీ ఎమ్మెల్యేలంతా ఆ తీర్మానానికి వ్యతిరేకంగా రాష్ట్రపతిని కలిశామని చెప్పారు. దీనిపై కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి, సామాజిక న్యాయ మంత్రి రామ దాసు అథవాలేని కలిసి వినతిపత్రాలు అందించామని చెప్పారు. రాష్ట్రంలోని బోయ, వాల్మీకులందర్నీ ఎస్టీల్లో చేరుస్తూ టిడిపి నాడు తీర్మానం చేసిందని తెలిపారు. ఇప్పుడు సిఎం జగన్ కేవలం ఐదు జిల్లాల్లో ఉన్న బోయ, వాల్మీకిలను గిరిజనుల జాబితాలో చేర్చాలని తీర్మానం చేశారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు నష్టం వాటిల్లకుండా చూస్తానని సిఎం హామీ ఇచ్చారని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో ఎస్టీలకు మంత్రి పదవి కూడా ఇవ్వలేదని చెప్పారు. ఎస్టీ కమిషన్, జిసిసి, ట్రైకార్ లాంటి చైర్మన్ పదవులను భర్తీ చేయని చరిత్ర టిడిపిదని విమర్శించారు. అలాంటి టిడిపి నాయకులకు గిరిజనుల హక్కులు, ప్రయోజనాల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. రెండు రోజుల క్రితం మన్యం బంద్ లో భాగంగా గిరిజన సంఘాల నాయకులు తనని ఎన్ని విమర్శలు చేసినా భరిస్తామని చెప్పారు. వారి ఆందోళనలో న్యాయం ఉందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ పదవుల్లో ఎస్టీలకు సముచిత స్థానం కల్పించిందని చెప్పారు. గిరిజన ఎమ్మెల్యేగా తనకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిందన్నారు. ఎస్టీ కమిషన్, జిసిసి, ట్రైకార్ లాంటి సంస్థలకు చైర్మన్లుగా గిరిజనులను నియమించారని తెలిపారు. టిడిపి హయాంలో జరగని అభివృద్ధి తమ ప్రభుత్వం హయాంలో జరుగుతున్నాయని చెప్పారు.

మహిళా అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

సీతానగరం : మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో డ్వాక్రా మహిళలకు ఆసరా నిధుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎంపిపి బి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 13,800 మంది డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా నిధులు కింద రూ.6 కోట్ల 86 లక్షలు నిధులు విడుదయ్యాయని తెలిపారు. అరకు ఎంపి గొట్టేటి మాధవి మాట్లాడుతూ మహిళల కోసం చేయూత, ఆసరా, ఒంటరి మహిళ పెన్షన్లు తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, పెదబోగిలి ఎంపిటిసి సభ్యులు సురగాల గౌరి, గురుడి కుసుమ కుమారి, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు, ఎంపిడిఒ ఎంఎస్‌కెవెన్ ప్రసాద్, ఎపిఎం ఆర్.శ్రీరాములు, వైసీపీ నాయకులు బలగ శ్రీరాములనాయుడు, ఎం.ధనుంజయ నాయుడు, ఆర్‌వి పార్థసారధి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



చలో ఢిల్లీకి వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఢిల్లీ పయనమైన ప్రజాసంఘాల నాయకులు

సాలూరురూరల్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆదివారం ఢిల్లీ పయనమయ్యారు. సాలూరు, మక్కువ, పాచిపెంట, సీతానగరం రామభద్రపురం మండలాలకు చెందిన రైతులు, కార్మికులు, కర్షకులు, ప్రజాసంఘాల కార్యకర్తలు బొబ్బిలి రైల్వే స్టేషన్ నుంచి సమతా ఎక్స్‌ప్రెస్‌కు బయలుదేరారు. వీరికి సిఐటియు, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు ఎన్‌వై నాయుడు, ఈశ్వరరావు, గంగు నాయుడు, డివైఎఫ్ఐ సురేష్, మున్సిపల్ యూనియన్ నాయకులు శంకర రావు, రాములు ఉన్నారు.

మలాథీన్ స్ప్రేయింగ్ చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గ్రామాల్లో వైద్యాధికారులు మలాథీన్ స్ప్రేయింగ్ చేపట్టాలని ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ కోరారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో దోమల బెడద ఎక్కువైందన్నారు. దోమ కాటు వల్ల గిరిజనులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రతి ఏటా మలేరియా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. దోమకాటు నుంచి రక్షణకు తక్షణమే దోమతెరలు పంపిణీ చేయాలని, ప్రతి ఇంటి వద్ద, మురికి కుంటల వద్ద మలాథియన్ స్ప్రేయింగ్ చేపట్టి దోమలను నివారించాలని కోరారు. మరోవైపు గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు ముందస్తు ప్రణాళిక వేసి నీటి సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సిఎస్ డి.నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలకొండ డివిజన్లోని ఏడు మండలాల్లో వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కేటాయించినట్లు ఆమె తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవి

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

పాలకొండ రూరల్ : ఉత్తరాంధ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి వేపాడ చిరంజీవి అన్నారు. ఆదివారం స్థానిక ఎలైట్ కళాశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను గెలిచిన వెంటనే గ్రూపు -2 నోటిఫికేషన్ విడుదల చేయాలని వినతిపత్రం అందజేశానని, అందుకు ప్రభుత్వం కూడా అంగీకరించిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పాటు పడతానన్నారు. శాసనమండలిలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం మాట్లాడుతానన్నారు. ఆయనతో పాటు ఎంఇఒ సూర్యనారాయణ, విశ్రాంత లైబ్రేరియన్ చౌదరినాయుడు, ఎపిటిఎఫ్ నాయకులు సంపత్, వాసుదేవరావు, పద్మజ తదితరులున్నారు.

సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలి

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఉన్న చెక్ డ్యాములు, మినీ రిజర్వాయర్లు తక్షణమే మరమ్మతులు చేపట్టి ఖరీఫ్ సీజన్లో పంట పొలాలకు సాగునీరు అందుబాటులో ఉంచాలని కురుపాం నియోజకవర్గం టిడిపి నాయకులు నందివాడ కృష్ణబాబు కోరారు. టిడిపి, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన చెక్ డ్యాములు నేడు శిథిలమై ఉండడంతో పంట పొలాలకు నీరందని పరిస్థితి ఉందన్నారు. దీంతో గిరిజన రైతులు ప్రతి ఏటా వర్షాధారంపైనే ఆధారపడుతున్నారని అన్నారు. గతంలో సీమలగూడ మినీ రిజర్వాయర్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పెట్టిన నేటి వరకు పనులు చేపట్టలేదన్నారు. సాగు నీరందుబాటులో లేకపోవడంతో గిరిజన రైతులు ఆలస్యంగా వరి నాట్లు వేయడంతో వరి కోతలు కూడా ఆలస్యంగా జరుగుతున్నాయని అన్నారు. దీంతో రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో అధికారులు కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో రైతులకు పండించిన పంటను ఇంటి వద్దనే నిల్వ ఉంచుకోవాల్సి వస్తుందని అన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఉపాధ్యాయులు

ఎపిఒటిఒ మేధో సన్మాన్ టాలెంట్ టెస్ట్

భామిని : ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన ఆధ్వర్యంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఒడియా మాధ్యమంలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థులకు మేధో సన్మాన్ టాలెంట్ టెస్ట్(2023) ఆదివారం నిర్వహించారు. ఎపిఒటిఒ భామిని శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్.సుఖిల, ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో బత్తిలి ఎంపిపి స్కూల్‌లో ఈ పరీక్ష నిర్వహించారు. మండలంలోని మూడు పాఠశాలల నుండి 15 మంది విద్యార్థులు హాజరయ్యారు. టాపర్‌గా కిరణ్ గౌడో(బత్తిలి), రెండోవ స్థానంలో ప్రియాంబోద గౌడో(కాట్రగడ), మూడో స్థానంలో బాదపు శృతి (బత్తిలి) దక్కించుకున్నారు. వీరికి ఎపిఒటిఒ భామిని శాఖ, పిఆర్‌టియు తరపున మీసాల ప్రపుల్ కుమార్ ప్రశంసా పత్రం, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్.ఇందిర, బి.రోహినేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

పాలకొండ రూరల్ : స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా నీతికథలతో పాటు వివిధ కథలు పిల్లలు ఆసక్తిగా చదివారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు, ఈశ్వర్ ఉన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార సామగ్రి పంపిణీ

పార్వతీపురంరూరల్ : రాష్ట్రప్రభుత్వం ఈనెల 7 నుంచి చేపట్టనున్న జగనాన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రచార సామాగ్రిని ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు దిశా నిర్దేశం చేశారు. వెంకంపేట, తాళ్లబురిడి, డోకిశిల, డికె పట్నం సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, వాలంటీర్లు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పంపిణీ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ బొమ్మి రమేష్, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, జెడ్‌పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, చినబొండపల్లి ఎంపిటిసి సభ్యులు బంకురు రవికుమార్, నాయకులు కాపారపు సత్యనారాయణ, గుర్రాజు పాల్గొన్నారు.

వసుదైక భావనే ప్రపంచానికి దిక్సూచి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వైవిధ్యం, విస్తారమైన దేశంలో భారతీయ సనాతన వ్యవస్థ ఎంతో స్ఫూర్తివంతమైనదని స్వామి వివేకానంద కేంద్ర తెలుగు రాష్ట్రాల ప్రాంత సంఘటక్ సుజాత నాయక్ అన్నారు. అంతా ఒక్కటనే వసుదైక కుటుంబ భావనే ప్రపంచానికి దిక్సూచి కాగలదని అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక జట్టు ఆశ్రమంలో వివేకానంద కేంద్ర(కన్యాకుమారి) ఆధ్వర్యంలో జీ-20 సదస్సులో భాగంగా సివిల్ సొసైటీ-20 చర్చా వేదికను ఆదివారం నిర్వహించారు. జట్టు నిర్వాహకులు పద్మజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మన శరీరంలో ఏ రెండు అవయవాలు మరొకదానితో సమానంగా ఉండవని, అయితే ప్రతిదీ తనదైన పనిలో కీలకమైన దేనని గుర్తు చేశారు. అలాగే అన్ని ప్రాంతాలు, వర్గాల వారు పరస్పర గౌరవం, సమన్వయంతోనే సమాజ ప్రగతి సాధ్యపడుతుందని తెలిపారు. అంతా మనం, మనవారనే భారతీయ తాత్విక చింతనే వసుదైక కుటుంబ భావనని పేర్కొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

ఆధిపత్య పోరుకు స్వస్తి పలికి ఏకత్వానికి మార్గనిర్దేశం కాగలదని ఆకాంక్షించారు. భారతీయతతో ప్రపంచాన్ని అనుసంధానం చేయడం, జనజీవనాన్ని ఇందులో భాగస్వామ్యం చేయడమే సివిల్ సొసైటీ-20 లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం సంస్కృతి, విద్య, వ్యవసాయ రంగాల ద్వారా దీనిని చేరుకోగల మార్గాలపై చర్చించి, పలు ప్రతిపాదనలను జీ-20 సమన్వయకర్తలకు పంపించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ విఎస్‌ఎన్ కుమార్, ఆడిటర్ దుర్గా బాలాజీ, వివేకానంద కేంద్ర ప్రాంత సంఘటక్ లక్ష్మీ నారాయణ, ఆంధ్ర సంఘటక్ రవికుమార్, పారినాయుడు మాస్టారు, నందివాడ వేణుగోపాల్, డాక్టర్ చైతన్య, ఆర్టిక్ ప్రకాష్, స్థపతి నర్సింహాచార్యులు, ఏపీజీవీబీ రైటైర్డ్ మేనేజర్ ఎన్.నగేష్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పట్టణాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.2 కోట్ల 13 లక్షల నిధులతో రహదారులకు శంకుస్థాపనలతో పాటు ప్రారంభోత్సవాలు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పంచాయతీలో అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అవసరమైతే పురపాలక శాఖామంత్రితో మాట్లాడి నిధులు తీసుకువస్తామన్నారు. ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారం కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. పట్టణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెడతామన్నారు. ప్రజలంతా తమ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, కమిషనర్ సర్వేశ్వరరావు, పూర్వపు కమిషనర్ లిల్లీపుష్పనాథం, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, వెలమల మన్మథరావు, కొంచాడ అరుణ్, భాసూరు కాంతారావు, పల్లా భాను తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం:

2024 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలోని వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆ పార్టీ ఉత్తరాంధ్ర యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రం తెలిపారు. జోనల్ ఇన్చార్జి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా గుమ్మలలక్ష్మీపురం వచ్చినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జగన్ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నవరత్నాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ప్రజలు ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. చిన్న వయస్సులోనే సర్పంచ్ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చి గుమ్మలక్ష్మీపురాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం పట్ల కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి దీనమయ్యే, వైస్ పిపి నిమ్మక శేఖర్, ఉప సర్పంచ్ కిషోర్ కుమార్ ఉన్నారు.

ఎపిఆర్ఎస్ఎ జిల్లా కార్యవర్గ ఖాళీలు భర్తీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గంలో ఖాళీ అయిన సభ్యులను భర్తీ చేశారు. ఈ మేరకు కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షులు గొట్టాపు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. తొలుత ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా జిల్లాలో చేపట్టిన నల్ల రిబ్బన్లతో నిరసన, వర్క్ టు రూల్ పాటించేందుకు సహకరించిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కార్యవర్గంలో ఖాళీ అయిన కార్యదర్శి, క్రీడలు, సాంస్కృతి కార్యదర్శులుగా పి.సోమేశ్వరరావు (తహశీల్దారు, పాలకొండ), బి.శివరామకృష్ణ (జూనియర్ సహాయకులు, ఆర్‌డిఒ కార్యాలయం, పార్వతీపురం), ఉపాధ్యక్షులుగా ఎన్.శ్రీనుబాబు (ప్రత్యేక రెవెన్యూ పరిశీలకులు, గిరిజన సంక్షేమ ఉప కలక్టరు వారి కార్యాలయం, ఎల్విన్‌పేట), కార్యవర్గ సభ్యులుగా పి.రమేష్ నాయుడు (రీ-సర్వే ఉప తహశీల్దారు బలిజిపేట), పి.రామచంద్రరావు (రెవెన్యూ పరిశీలకులు, పాచిపెంట)తో భర్తీ చేసేందుకు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. ఈ


సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.శివన్నారాయణ, ఎస్.నరసింహమూర్తి, సిహెచ్.రాధాకష్ణమూర్తి, కోశాధికారి పిఎఎల్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


సుబ్బారావుకు నివాళ్లు అర్పిస్తున్న మున్సిపల్ కార్మికులు

సుబ్బారావుకు ఘన నివాళి

సాలూరు : రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల ఉద్యమాన్ని బలోపేతం చేయడంలోనూ, విశాఖ జిల్లాలో సిపిఎం విస్తరణలో జి.సుబ్బారావు చేసిన కృషి మరువలేనిదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు అన్నారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాజువాకకు చెందిన సుబ్బారావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందడం బాధాకరమైన విషయమన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటరావు, లక్ష్మి, మధు ఆయనకు నివాళులు అర్పించారు.


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - కురుపాం

క్రీడల్లో యువత రాణించాలని ఎల్విన్ పేట ఎస్ఐ షణ్ముఖరావు అన్నారు. మండలంలోని పెద గొత్తిలి పంచాయితీ పెదబారామణిలో ఆదివారం నుండి జరిగే మండల స్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. టోర్నీ నిర్వాహకులు, సర్పంచ్ టి. లోకనాథం, మాట్లాడుతూ ఈ పోటీల్లో 40 టీములు పాల్గొంటాయని, మొదట బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ. 5వేలు నగదును అందజేస్తున్నామన్నారు. ఆసక్తి గల టీములు టోర్నీలో పాల్గొనవచ్చన్నారు. అలాగే 18 ఏళ్ల నిండిన వారికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే స్లాట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఆర్. లావరాజు, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఐ.రామకృష్ణ, మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు టి.నాగభూషణరావు, గ్రామ యువత మరియు పెద్దలు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు దేవానంద్



గుమ్మలక్ష్మీపురం : ఈనెల 9, 10 తేదీల్లో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో తిరుపతిలో మహతి ఆడిటోరియంలో 48 గంటల పాటు నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహోత్సవాలకు గుమ్మలక్ష్మీపురానికి చెందిన పాలక దేవానంద్, డాక్టర్ ఉమా కవిని ఆహ్వానించారు. ఇప్పటి వరకు వీకివురు రచించిన కవితలకు మంచి ఆదరణ రావడంతో వీరిద్దరి పేర్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి కె.దీనమయ్య, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, దోస్త్ మేరా దోస్త్ సభ్యులు పాలక ప్రేమానంద్, వర్తక సంఘం, వైశ్య సంఘం సభ్యులు అభినందించారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

సీతానగరం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం నుంచి ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ జి.సూర్యదేవుడు తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ సమయంలో సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా తాడి



సాలూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా తాడి తిరుపతిరావు ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా బొత్స శ్రీనివాసరావు, కోశాధికారిగా రావాడ రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా సబ్బాన వేణుగోపాల నాయుడు, సంయుక్త కార్యదర్శిగా బందావు కూర్మారావు, గ్రంథాలయ కార్యదర్శిగా కె.శంకరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా టి.మురళీకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తాడి తిరుపతిరావు మాట్లాడుతూ పట్టణంలో అదనపు కోర్టు, సబ్ కోర్టు ఏర్పాటు, సబ్ జైలు పునరుద్ధరణ కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక రావాడ జంక్షన్ సమీపంలో గల గుడ్ సమారిటన్ లూథరన్ దేవాలయం పాస్టర్ రెవరెండ్ పి.జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో మట్టల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలతో కలిసి ఈత రెమ్మలు పట్టుకుని కురుపాం ప్రధాన రహదారి, శివన్నపేట, వైరిచర్ల కాలనీ వరకు ఏసుక్రీస్తు పాటలు పాడుతూ మట్టల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ పెద్దలు డి. జాన్, డి.రాజారత్నం, డి.ప్రదీప్, కె.సుదర్శన్, కె.ఈశ్వరరావు, డి.మజ్జి బాబు, యవకులు, సండే స్కూల్ పిల్లలు, స్త్రీలు పాల్గొన్నారు.


కురుపాం వీధుల్లో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

భామిని: మండలంలోని బత్తిలిలో ఫాదర్ చార్లెస్, ఫాదర్ రాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు మానుకోమ్మల ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా జీసస్‌ను ప్రార్థిస్తూ బత్తిలి పురవీధుల్లో తిరిగారు. కార్యక్రమం లో సిస్టర్,నులకజోడు, నేరడి లివిరి, భామిని దీక్ష పరులు, విశ్వాసకులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ చేపలు, మాంసం మార్కెట్ సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు మున్సిపల్ అధికారులను కోరారు. ఆదివారం జనసేన నాయకులు గొర్లి చంటి, దాలినాయుడు, బాలు, సతీష్, హేమంత్, లంక సతీష్ మున్సిపల్ చేపలు, మాంసపు మార్కెట్‌ను పరిశీలించి అక్కడ వ్యాపారులతో మార్కెట్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అక్కడి వ్యాపారులు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయానికి పక్కనే ఉన్న చేపల మార్కెట్‌ను పట్టించుకోకపోవడం దారుణమని, తక్షణమే అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మక్కువ - చినబోగిలి రోడ్డు పనులు ప్రారంభం

మక్కువ: మండలంలోని మక్కువ -చిన్న భోగిలి వరకు ఆర్అండ్‌బి రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. సుమారు రూ.30 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. సుమారు 50 అడుగుల వెడల్పు గల రోడ్డు పరిధిలో మునక్కాయవలస, పాపయ్యవలస, కొయ్యలపేట, వెంకట బైరపురం గ్రామాలతో పాటు సీతానగరం మండలంలోని బగ్గందొరవలస, తామరకండి గ్రామాల గుండా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రోడ్డు పకనున్న ఇళ్లను, ప్రార్ధనా స్థలాలను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాల ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఆటంకం లేకుండా పనులు జరుగుతున్నాయి ఆయా గ్రామాలు పరిధిలోని రోడ్డు పనుల కారణంగా ఇళ్లు కోల్పోయిన, ఇతర స్థలాలు కోల్పోయిన వారికి సహకరించాలని అందించాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు

అధికారుల అనాలోచిత నిర్ణయం సరికాదు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పదో తరగతి పరీక్షలు జరుగు పాఠశాలలకు ఆయా రోజుల్లో సెలవులు ఇచ్చి వాటికి బదులుగా ఇతర సెలవు దినాల్లో పనిచేయ మనడం సరైన నిర్ణయం కాదని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 18వరకు పరీక్షలు జరుగుతాయన్న విషయం అధికార్లకు తెలియదా అని ప్రశ్నించారు. పరీక్ష జరిగిన రోజు మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5గంటల వరకు పనిచేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు కూడా ఈ విషయంలో ప్రభుత్వాన్ని పునరాలోచించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

కందిరీగల దాడిలో పది మందికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ సమీపాన గల శివన్నపేటకు వెళ్లే రహదారి వద్ద ఉన్నటు వంటి మర్రిచెట్టు దగ్గర కందిరీగలు దాడికి పదిమందికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం కందిరీగల పట్టు కదిలి జోగిరాజుపేటకు చెందిన జి.సింహాచలం ద్విచక్ర వాహనంతో శివన్నపేట వెళ్తుండగా ఒక్కసారి కందిరీగలు పట్టు పడి దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయ పడ్డాడు. అలాగే శివన్నపేటకు చెందిన ఇ.వెంకటరమణ కురుపాం నుంచి శివన్నపేటకు తన ఇంటికి వెళ్తుండగా ఆయనపై కూడా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతుండగా, మిగతా ఎనిమిది మందికి చిన్న చిన్న గాయాలు తగలడంతో ప్రాథమిక చికిత్స పొంది ఇంటికి వెళ్లిపోయారు. కందిరీగల దాడి ఇదే మొదటిసారి కాదని, పలుమార్లు ఇలా చాలామందిపై దాడి జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కందిరీగల దాడుల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ

ఆర్‌బికెలతో ప్రయోజనాలెన్నో : ఎఒ

ప్రజాశక్తి - పాచిపెంట

ఆధునిక వ్యవసాయంలో రైతులకు సాంకేతిక విజ్ఞానాన్ని అందించడం కోసమే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ఇందులో విత్తనాల నుంచి యంత్రాల వరకు అందుబాటులో ఉంచుతున్నామని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని నాందేడువలస, రాయిగుడ్డివలస రైతు భరోసా కేంద్రాలను సందర్శించి అందుబాటులో ఉన్న రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బికెల్లో ఒక దృశ్య శ్రవణ(టీవీ) యంత్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అలాగే వివిధ రకాల సేవల కోసం ఒక కియోస్క్‌ను ఏర్పాటు చేసిందని, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులకు సాంకేతిక సాగు, సలహాలు అందించడానికి ఒక డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తేవడంతో పాటుగా తీరిక వేళల్లో చదువుకోవడానికి లైబ్రరీని ఏర్పాటు చేసిందని అన్నారు. అలాగే రైతు భరోసా అనే మాస పత్రికను ఏడాదికి రూ.300 చందాపై రైతులకు అందిస్తుందని, దీంతో పాటు ఆర్‌బికె ఛానల్ అనే ఛానల్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా నిష్ణాతులైన శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞులైన రైతులతో సాగులో సలహాలు, ఇష్టా గోష్టి చర్చలు, రైతుల సాగు సమస్యలకు సూచనలు వంటివ అందిస్తుందని అన్నారు. ఈనెల 3న ఉద్యాన పంటల్లో అడవి పందుల బెడదపైన, 4న సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్, వేసవి మొక్కజొన్నలో సమస్యలు, 6న వేసవిలో పశువుల వ్యాధుల నివారణ, 11న ఆహార ఉత్పత్తుల్లో పురుగుల మందుల అవశేషాల ప్రభావం, 13న విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లు, మల్బరీ, పూల సాగు, వరి పంటలో కొత్త రకాలతో పాటుగా రైతుకు ఏడాది పాటు ఆదాయం వచ్చే ప్రణాళిక వంటి వివిధ అంశాలపై కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎలు అనిల్, సాయికిరణ్ పాల్గొన్నారు.


ఆర్‌బికె ద్వారా అందుతున్న సేవలను రైతులకు వివరిస్తున్న ఎఒ తిరుపతిరావు